https://epaper.andhramanam.com/

# ఆంధ్ర మనం

తెలుగు దినపత్రిక

తిరుపతి- సోమవారం 22 జూన్ 2026 | సంపుటి : 01 | సంచిక : 230 | పేజీలు : 8 | వెల రూ.5

PUBLISHED FROM TIRUPATI | AMARAVATHI | RAJAHMUNDRY | VISAKHAPATNAM | KURNOOL | ANANTAPUR | KADAPA | HYDERABAD |

సూర్య నమస్కారాలను తప్పనిసరి చేసిన

## తొలి జిల్లాగా రికార్డు

- కోటి మందితో యోగ ప్రపంచ రికార్డులో భాగస్వామ్యం
- మన్యం జిల్లాలో మిన్నంటిన యోగా ఉత్సాహం
- కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడి



4

మైనార్టీల సంక్షేమానికి

## అండగా ఉంటాం

- తబ్లీగీ జమాత్ ప్రతినిధులతో భేటీలో ఎంపీ కేశినేని చిన్ని



4

## ఎన్నికల్లో సున్నా... ఇప్పుడు ఇరవై!

- పార్లమెంటులో ఐదో పెద్ద పార్టీగా ఎన్‌సీపీఐ?
- ఫిరాయింపులతో కొత్త రాజకీయ సమీకరణాలు!



4

## యోగాతో మానవాళి ఏకం

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ షిల్లాంగ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
- యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపు
- తూర్పు వైమానిక దళ కేంద్రంలో యోగాభ్యాసం




4

## మూడు కొత్త యుద్ధ నౌకలు

- కోల్‌కతాలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- సముద్ర భద్రతలో మరో కీలక అడుగు
- ఆత్మనిర్భర్ భారత్‌కు నిదర్శనమన్న మోదీ



4




# ‘యోగాంధ్ర-2026’కు అంతర్జాతీయ గుర్తింపు

2

లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం ■ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధ్రువీకరణ పత్రం అందజేత

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘యోగాంధ్ర 2026’ సామూహిక ఆరోగ్య, యోగా ఉద్యమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా అపూర్వమైన రీతిలో ప్రజా సమీకరణ, రికార్డు స్థాయి భాగస్వామ్యంతో విజయవంతమైన ఈ మెగా కార్యక్రమం లండన్‌కు చెందిన ప్రతిష్టాత్మక “వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్”లో స్థానం సంపాదించుకుంది. ఈ అంతర్జాతీయ రికార్డుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్-సౌత్ రీజియన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఉల్లాజి ఎలియాజర్ సచివాలయంలో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు అధికారికంగా అందజేశారు. ఈ అవార్డును ప్రభుత్వం తరఫున ఆయుష్ శాఖకు అందించి, వారిని సీఎం అభినందించారని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. అందరి సమిష్టి కృషివల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన కొనియాడారు.

- అమరావతి, ఆంధ్ర మనం

పోలవరం కాలువ

# ప్రభావం

## మిగిలిన భూములపై ‘నిషేధం’!

22-ఏ నిషేధిత జాబితాలో ఇరుక్కుపోయిన నక్కపల్లి రైతుల సొంత ఆస్తులు

- ఉదారంగా భూములిస్తే ఉచ్చులా మారిన సర్వే నెంబర్లు
- రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో అన్నదాతల క్షోభ
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు
- రీ-సర్వేపైనే గంపెడు ఆశలు పెట్టుకున్న బాధితులు



పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం వల్ల సాగునీరు అందుకుని తమ కష్టాలు తీరతాయని ఆశించిన రైతులకు కొత్త సమస్యలు ఎదురయ్యాయి. కాలువ కోసం భూములు ఇచ్చిన రైతుల మిగిలిన భూములు 22-ఏ నిషేధిత జాబితాలో చేరిపోవడంతో క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రెండు దశాబ్దాలుగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏఐతో బాలిక ఫోటోలు

## మార్ఫింగ్

ట్యూషన్ టీచర్ అరెస్ట్





## నీట్ పరీక్షకు ఇద్దరు ఆలస్యం

కలెక్టర్‌ను వేడుకున్న తల్లిదండ్రులు..

అయినా ఫలితం శూన్యం..!

తానేం చేయలేనన్న కలెక్టర్ ఆనంద్

2

## ‘ఈగల్ 1972’ పోస్టర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

యోగాంధ్ర వేదికగా ఈగల్ సేవలకు ప్రశంసలు




యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ‘యోగాంధ్ర’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ‘ఈగల్ 1972’ పోస్టర్లను ఆవిష్కరించారు.

2

టీడీపీ, జనసేన నుంచి 60 కుటుంబాలు

## వైసీపీలో చేరిక

3



ఆత్మీయ సమావేశం కాదు

## ఆత్మావలోకన భయం

- వైసీపీపై మంత్రి కందుల దుర్గేష్ విమర్శలు
- ఆత్మీయ సమావేశాల పేరుతో వైసీపీ కాపు నేతలు కపట నాటకాలని ధ్వజం
- పిఠాపురంలో పర్మినెంట్ అడ్రస్ గల్లంతయ్యే సరికే మాజీ ఎంపీ వంగా గీతకు తీవ్ర ఫ్రస్టేషన్.



3



2

అమరావతి మీదుగానే

# బుల్లెట్ రైలు

## ఏపీలో తొలి స్టాప్ ‘దాచేపల్లి’

- డీపీఆర్‌కు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్!
- మొత్తం 760 కిలోమీటర్ల మేర కారిడార్
- మూడు రాష్ట్రాల్లో కలిపి 18 స్టేషన్లు..
- పలమనేరు సమీపంలో భారీ సొరంగమార్గం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మీదుగా బుల్లెట్ రైలు పరుగులు తీయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిష్టాత్మక ‘హైదరాబాద్-అమరావతి-చెన్నై’ హైస్పీడ్ రైలు కారిడార్ రాజధాని నగర పరిధి నుంచే వెళ్లనుంది. అమరావతికి కొద్ది దూరంలో ఉన్న రావెల వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుకొని ఈ కారిడార్ అలైన్‌మెంట్ ఉండాలని గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఈ మేరకు తుది లొకేషన్ సర్వే, డీపీఆర్ (ఌూ=) సిద్ధం చేయడం కోసం నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ కార్యాచరణ కూడా చేపట్టింది.

యోగ భారతీయ సంస్కృతికి

## అమూల్యమైన కానుక



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

యోగ అనేది భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక వికాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్రపతి వివరించారు.

4



## యోగాతో దృఢత్వం.. వికాసం.. ప్రశాంతత

3

ఆంధ్ర మనం

సోమవారం జూన్ 22 2026




## 'ఈగల్ 1972' పోస్టర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

### యోగాంధ్ర వేదికగా ఈగల్ సేవలకు ప్రశంసలు

**అమరావతి, జూన్ 21 (ఆంధ్ర మనం):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 'యోగాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఈగల్ 1972' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్, రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యసనముక్త భారత్ అభియాన్ ప్రచార వాహనాన్ని ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం 'ఈగల్ 1972' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈగల్ ఆంధ్రప్రదేశ్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా భద్రత చర్యలు, అవగాహన కార్యక్రమాల గురించి ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ ముఖ్యమంత్రికి వివరించారు. సంస్థ నిర్వహిస్తున్న ప్రజోపయోగ కార్యక్రమాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐజీపీ ఆకే రవికృష్ణను అభినందించారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా సేవా కార్యక్రమాలను విస్తరించాలని సూచించిన ముఖ్యమంత్రి, ఈగల్ బృందం చేస్తున్న కృషిని ప్రశంసించారు. యోగాంధ్ర కార్యక్రమానికి వేలాది మంది యోగా సాధకులు, యువత, ప్రజలు హాజరుకాగా, 'ఈగల్ 1972' పోస్టర్ల ఆవిష్కరణ సంస్థకు మరింత గుర్తింపును తీసుకొచ్చింది. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీషా, విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈగల్ ఎస్పీ జి. స్వరూపారాణి, హెడ్‌క్వార్టర్స్ డీఎస్పీ కె. సింగయ్య, విజయవాడ ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీంద్రతో పాటు ఈగల్ టీమ్ సభ్యులు హాజరయ్యారు.

## నీట్ పరీక్షకు ఇద్దరు ఆలస్యం

### కలెక్టర్‌ను వేడుకున్న తల్లిదండ్రులు.. అయినా ఫలితం శూన్యం..!



**అనంతపురం, జూన్ 21 (ఆంధ్ర మనం) ::** అనంతపురం జిల్లాలో ఇద్దరు అభ్యర్థులు ఆలస్యం రావడంతో నీట్ పరీక్ష రాయలేకపోయారు. బైక్ యాక్సిడెంట్ వల్ల ఆలస్యమైందని, పరీక్షకు తమ బిడ్డలను అనుమతించాలని కలెక్టర్ వాహనానికి విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా తానేం చేయలేనని టైమ్ రికార్డు అవుతుందని కలెక్టర్ ఆనంద్ సూచించారు. పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఈ ఘటన జరిగింది. చివరికి పరీక్ష రాయలేకపోయామంటూ విద్యార్థినీలు కన్నీరు పెట్టుకున్నారు.

## ఏఐతో బాలిక ఫోటోలు మార్ఫింగ్

### ట్యూషన్ టీచర్ అరెస్ట్

**విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్ర మనం) :** ఏఐతో బాలిక ఫోటోలను మార్ఫింగ్ చేసిన పార్ట్‌టైం ట్యూటర్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి సాధారణ ఫోటోలను అశ్లీల చిత్రాలుగా మార్చి, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న నిందితుడు నగరానికి చెందిన షణ్ముఖి హితేష్‌గా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం ఎన్జీజీఓస్ కాలనీకి చెందిన షణ్ముఖి హితేష్ ఒక ప్రైవేట్ ట్యూషన్ సెంటర్‌లో పార్ట్‌టైమ్ ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడికి వచ్చే బాలికతో పరిచయం పెంచుకున్నాడు. సాధారణంగా ఉన్నప్పుడు తీసుకున్న ఆమె ఫోటోలను, కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి అశ్లీలంగా మార్ఫింగ్ చేశాడు. ఆ మార్ఫింగ్ చిత్రాలను చూపిస్తూ బాలికను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తూ, తీవ్ర మానసిక, లైంగిక వేధింపులకు గురిచేశాడు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికగా పలువురు అమ్మాయిలతో పరిచయాలు పెంచుకుని, వారిని నమ్మించి అశ్లీల వీడియో కాల్స్ చేయాల్సిందిగా ఒత్తిడి తెచ్చేవాడు. ఆ పై సదరు వీడియో కాల్స్‌ను రహస్యంగా స్క్రీన్ రికార్డ్ చేసి భద్రపరిచేవాడు. ఆ దృశ్యాలను చూపిస్తూ బాధితులను బెదిరిస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురిచేసేవాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు, అందించిన సాంకేతిక ఆధారాల ప్రకారం సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు షణ్ముఖి హితేష్‌ను పట్టుకుని జైలుకు తరలించారు.



# 'యోగాంధ్ర-2026'కు అంతర్జాతీయ గుర్తింపు

- లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం
- చంద్రబాబుకు ధృవీకరణ పత్రం అందజేత



**అమరావతి, జూన్ 21 (ఆంధ్ర మనం):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యోగాంధ్ర-2026' కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ యోగా ఉద్యమానికి లండన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' గుర్తింపు లభించింది. ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ రీజియన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఉల్లాజి ఎలియాజర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా అవార్డును ఆయుష్ శాఖకు అందజేసి అభినందించిన ముఖ్యమంత్రి, యోగాంధ్ర విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ ప్రశంసించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇది అందరి సమష్టి కృషి ఫలితమని పేర్కొన్నారు.

### లక్ష్యాన్ని మించిన నమోదు

రాష్ట్రంలో 1.05 కోట్ల మంది యోగా ఔత్సాహికులను



భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని చేపట్టగా, ఆ లక్ష్యాన్ని అధిగమిస్తూ 1.07 కోట్ల మంది నమోదు చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. దీంతో కూటమి ప్రభుత్వం యోగా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించినట్లు పేర్కొన్నారు. యోగాను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు 7,745 మంది యోగా మాస్టర్ ట్రైనర్లు, 2.61 లక్షల మంది సాధారణ యోగా ట్రైనర్లు, 511 మంది యోగా గురువులు సేవలందించినట్లు ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,32,183 కేంద్రాలను గుర్తించి, ఒకేసారి 1.45 కోట్ల మంది యోగా సాధన చేసేలా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. యోగా ప్రచారంలో భాగంగా నిర్వహించిన 26 థీమాటిక్ యోగా ప్రదర్శనల్లో 35,603 మంది పాల్గొనగా, రాష్ట్రంలోని 55 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక యోగా కార్యక్రమాల్లో 59,458 మంది భాగస్వాములయ్యారు. యోగాపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బహుళ అంచెల పోటీలను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,20,696 గ్రామ, వార్డు స్థాయి పోటీలు నిర్వహించగా, మండల, జిల్లా స్థాయిలను దాటి రాష్ట్రస్థాయి తుది పోటీలకు 372 మంది ప్రతిభావంతులు అర్హత సాధించారు. వీరిలో 66 మంది విజేతలుగా నిలిచి రాష్ట్ర యోగా ఉద్యమానికి బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంపికైనట్లు ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. యోగాను ప్రజా ఉద్యమంగా మలచాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి యోగాంధ్ర-2026 నిదర్శనంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ రికార్డు గుర్తింపు ద్వారా ఆంధ్రప్రదేశ్ యోగా ఉద్యమం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని అభిప్రాయపడ్డారు.

# పోలవరం కాలువ 'ప్రభావం'



- మిగిలిన భూములపై 'నిషేధం'!
- 22-ఏ నిషేధిత జాబితాలో ఇరుక్కుపోయిన నక్కపల్లి రైతుల సొంత ఆస్తులు
- ఉదారంగా భూమిలిస్తే ఉచ్చులా మారిన సర్వే నెంబర్లు
- రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో అన్నదాతల క్షోభ
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు
- రీ-సర్వేపైనే గంపెడు ఆశలు పెట్టుకున్న బాధితులు

**నక్కపల్లి, మే 22 (ఆంధ్ర మనం):** పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంతో పంటలు పండి తమ కష్టాలు తీరుతాయని భావించిన అన్నదాతలకు ఆశలు నెరవేరకపోగా, కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. భూసేకరణ సమయంలో ఆశించిన స్థాయిలో పరిహారం దక్కకపోయినా.. కాలువ ఏర్పాటుతో తమ ప్రాంతం సస్యశ్యామలవుతుందని, పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్న ఉదార స్వభావంతో రైతాంగం తమ భూములను ప్రభుత్వానికి అప్పగించింది. అయితే, ఈ ప్రక్రియలో కొంతమంది రైతులు తమ భూములను పూర్తిగా కోల్పోగా, మరికొంతమందికి చెందిన భూములు సగం కాలువలోకి పోయాయి. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. కాలువ పోగా అదే సర్వే నెంబరులో మిగిలివున్న రైతుల సొంత భూములు రాత్రికి రాత్రే నిషేధిత '22-ఏ' జాబితాలో ఇరుక్కుపోయాయి. అప్పటి నుండి తమ ఆస్తులను పిల్లలకు పెళ్లిళ్లు, చదువుల నిమిత్తం బహుమానంగా ఇవ్వాలన్నా, అత్యవసర అవసరాల కోసం క్రయ, విక్రయాలు జరపాలన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు కావడం లేదు. ఈ '22-ఏ' చట్టం రైతుల పాలిట మరణశాసనంగా మారిందనడానికి నక్కపల్లి మండల రైతాంగమే సజీవ సాక్ష్యం.

### రెండు దశాబ్దాల నిరీక్షణ.. కల్లలైన అన్నదాతల కలలు!

రెండు దశాబ్దాల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు సాగునీరందిస్తే రాష్ట్రం బాగుపడుతుందన్న బృహత్తర లక్ష్యంతో ఇందిరా సాగర్ (పోలవరం) ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికోసం రైతుల నుండి ఆయా గ్రామాల పరిధిలో మార్కెట్ విలువను బట్టి భూసేకరణ చేశారు. నక్కపల్లి మండలంలోని దేవవరం, రామభద్రపురం, డొంకాడ, ముకుందరాజుపేట, రమణ్యపేట, చినదొడ్డిగల్లు, పెదదొడ్డిగల్లు, పెదబోదిగళ్లం గ్రామాలకు సంబంధించి రమారమి 15 కిలోమీటర్ల పొడవున భూసేకరణ జరిపారు. కాలువ ఏర్పాటు కోసం మొత్తం 912 మంది రైతుల నుండి 689 ఎకరాల భూమిని సేకరించారు. చిన్న, సన్నకారు రైతులు తమ భూములను కోల్పోయినప్పటికీ, మిగతా భూములలోనైనా నీరు పారుతుందని ప్రభుత్వానికి సహకరించారు. అయితే భూసేకరణ జరిపి 22 సంవత్సరాలు గడిచిపోయినా.. ఇప్పటికీ పోలవరం ప్రాజెక్టు, ఎడమ కాలువ పనులు పూర్తికాకపోవడంతో అన్నదాతల ఆశయం అడియాశగానే మిగిలిపోయింది.


### ఒకే సర్వే నెంబర్.. ప్రభుత్వ ఖాతాలోకి భూమి!

కాలువ నిర్మాణానికి పూర్తిగా భూములను కోల్పోయిన రైతులు ప్రభుత్వం నుండి అందిన కొద్దిపాటి పరిహారం తీసుకుని కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కానీ, ఒకే సర్వే నెంబరులో అధిక మొత్తంలో భూమి ఉండి, అందులో కొంత భాగం కాలువకు పోగా మిగిలిన భూమి రైతుల ఆధీనంలోనే ఉంది. ఎప్పుడైతే ఒకే సర్వే నెంబరులో కొంత భూమిని కాలువ కోసం సేకరించారో.. రెవెన్యూ రికార్డుల లోపాల వల్ల ఆ సర్వే నెంబరు మొత్తం ప్రభుత్వ భూమిగా నమోదైపోయింది. ఇదేదో తెలియక అవసరాల నిమిత్తం క్రయ, విక్రయాలు జరిపేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన రైతులకు.. ఆ భూమి 'నిషేధిత జాబితా'లో ఉందనే సరికి ఒక్కసారిగా అవాక్కవుతున్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి తమ భూములను 'సబ్ డివిజన్' చేసి నిషేధిత జాబితా నుండి తొలగిస్తే తప్ప రిజిస్ట్రేషన్లు జరగవన్న చేదు నిజం రైతులకు అర్థమైంది.

### రీ-సర్వేపైనే గంపెడు ఆశలు!

నిషేధిత జాబితాలో ఉన్న భూములను జిల్లా అధికారులు మాత్రమే సబ్ డివిజన్ చేయాలంటూ మండల రెవెన్యూ అధికారులు, లేదు ఇది రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసిన నిర్ణయం అంటూ జిల్లా అధికారులు పరస్పరం చేతులెత్తేస్తున్నారు. దీంతో కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం దక్కడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రయోజనాల కోసం తమ భూములను ఉదారంగా ఇచ్చినందుకు ప్రభుత్వాలు తమకు తగిన గుణపాఠం చెప్పాయంటూ రైతులు క్షోభిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో వ్యవసాయ భూముల రీ-సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. రీ-సర్వే ద్వారా ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న చిన్న చిన్న భూ సమస్యలు చాలావరకు పరిష్కారం అవుతున్నాయి. దీంతో ఈ రీ-సర్వేలోనే అయినా తమ సర్వే నెంబర్ల సమస్యలు పరిష్కారం అయి, భూములు 22-ఏ నుండి విముక్తి పొందుతాయన్న గంపెడు ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.





### దేశం కోసం మా పంట భూములను ఇచ్చాం..

"పోలవరం కాలువ నిర్మాణానికి ప్రభుత్వానికి సహకరించి, దేశం కోసం మా పంట భూములను ఇచ్చాం. అలా భూములిచ్చిన పాపానికి మా వద్ద మిగిలివున్న సొంత పంట భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం ఎంతవరకు న్యాయం? దీనివల్ల మా పిల్లల పెళ్లిళ్లకు, చదువులకు భూమి అమ్ముకుందామన్నా రూపాయి పుట్టడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రీ-సర్వేలోనైనా మాకు న్యాయం చేసి ఈ నిషేధిత జాబితా నుండి మా భూములను తొలగించాలి."

**- వెలగా మురళీమోహన్, బాధిత రైతు**

### క్షేత్రస్థాయిలో సమగ్ర దర్యాప్తు జరుపుతాం.

"రైతులు ఎంత భూమిని కాలువ నిర్మాణంలో కోల్పోయారో దానికి సంబంధించిన సర్వే నెంబర్లతో సహా 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ' వారి నుండి ధృవీకరణ లేఖ తీసుకువస్తే, మేము క్షేత్రస్థాయిలో సమగ్ర దర్యాప్తు జరుపుతాం. ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి, బాధితులకు త్వరితగతిన 22-ఏ జాబితా నుండి విముక్తి కల్పించి న్యాయం చేస్తాం."


**- చిన్ని కృష్ణ, తహసిల్దార్, నక్కపల్లి**

# అమరావతి మీదుగానే బుల్లెట్ రైలు

- ఏపీలో తొలి స్టాప్ 'దాచేపల్లి'
- డీపీఆర్‌కు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్!
- మొత్తం 760 కిలోమీటర్ల మేర కారిడార్
- మూడు రాష్ట్రాల్లో కలిపి 18 స్టేషన్లు..
- పలమనేరు సమీపంలో సొరంగమార్గం



**అమరావతి, జూన్ 21 (ఆంధ్ర మనం):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మీదుగా బుల్లెట్ రైలు పరుగులు తీయనుంది. ఇందుకు సంబంధించిన హైదరాబాద్- అమరావతి- చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ రాజధాని మీదుగానే వెళ్లనుంది. అమరావతికి కొద్ది దూరంలో రావెల వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకొని ఈ కారిడార్ ఎలైన్‌మెంట్ ఉండాలని గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఈ మేరకు తుది లొకేషన్ సర్వే, డీపీఆర్ సిద్ధం చేయడం కోసం నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ కార్యాచరణ చేపట్టింది. కానీ, ఎయిర్‌పోర్ట్‌కు ఆనుకొని కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారుచేస్తే.. రాజధాని అమరావతికి, విజయవాడకు దూరంగా ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ సమీపం నుంచి గుంటూరు వైపు వెళ్లాల్సి వస్తుందని తాజాగా గుర్తించారు. ఈ నేపథ్యంలో రాజధాని నగరానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనతో తొలుత నిర్దేశించినట్లు అమరావతి మీదుగానే హైస్పీడ్ రైలు కారిడార్ వెళ్లేలా డీపీఆర్ రూపొందించాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మొత్తం 760.09 కిలోమీటర్ల మేర హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్ నిర్మితం కానుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో కలిపి 18 స్టేషన్లు నిర్మిస్తారు. తెలంగాణలో 180.32 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ కారిడార్‌లో హైదరాబాద్, శంషాబాద్, ఫ్యూచర్ సిటీ, డ్రైపోర్ట్, హాలియా, వాడపల్లి వద్ద స్టేషన్లు ఉంటాయి. ఇక ఏపీలో 518.54 కి.మీ. పొడవున కారిడార్ కొనసాగుతుంది. ఏపీలోకి ఈ ప్రవేశించే మొదటి స్టేషన్ దాచేపల్లి అవుతుంది. తర్వాత అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి వద్ద నిర్మిస్తారు. తమిళనాడులో 61.23 కి.మీ. కారిడార్ నిర్మించనున్నారు. అక్కడ తిరువళ్లూరు, చెన్నై ఔటర్ రింగ్ రోడ్/ మింజూర్, చెన్నై సెంట్రల్ స్టేషన్లు ఉంటాయి. పలమనేరు సమీపంలో 11.8 కి.మీ. సొరంగం ఇక, చెన్నై-బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్‌లో నాలుగు సొరంగాలు నిర్మిస్తారు. చెన్నై సెంట్రల్ స్టేషన్ వద్ద 1.73 కి.మీ., బెంగళూరులో రెండు చోట్ల 14.79 కి.మీ. మేర సొరంగ మార్గాలు ప్రతిపాదించగా.. చిత్తూరు జిల్లాలో కౌండిన్య వన్యప్రాణి అభయారణ్యం మీదుగా ఈ కారిడార్ వెళ్తుండటంతో పలమనేరు వద్ద అటవీ ప్రాంతంలో 11.8 కిలోమీటర్ల పొడవైన సొరంగం నిర్మిస్తారు. మొత్తం 306 కిలోమీటర్ల పొడవైన చెన్నై-బెంగళూరు కారిడార్ తమిళనాడులో 133 కి.మీ., ఆంధ్రప్రదేశ్‌లో 72 కి.మీ., కర్ణాటకలో 101 కి.మీ. ఉంటుంది. ఈ కారిడార్లలో స్టేషన్లు తమిళనాడులో చెన్నై సెంట్రల్, పూనమల్లె, పరందూరు, ఏపీలో చిత్తూరు, కర్ణాటకలో కోలార్, కొడిహళ్లి, వైట్‌ఫీల్డ్, బయప్పనహళ్లి మొత్తం 7 ఉంటాయి. హైదరాబాద్- అమరావతి- చెన్నై కారిడార్ తిరుపతి ఎయిర్‌పోర్టు మీదుగా, చెన్నై-బెంగళూరు కారిడార్ చిత్తూరు మీదుగా వెళ్లనున్నాయి. ఈ రెండికి అనుసంధానం కోసం తిరుపతి- చిత్తూరు మధ్య కారిడార్ నిర్మించాలని గతంలో చంద్రబాబు గతంలో సూచించారు. దీనిని పరిగణలోకి తీసుకున్న నేషనల్ హైస్పీడ్ రైలు కార్పొరేషన్ అధికారులు.. ఫైనల్ లొకేషన్ సర్వే, డీపీఆర్ తయారీపై దృష్టిపెట్టారు. ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే మరో హైస్పీడ్ రైలు కారిడార్ హైదరాబాద్-బెంగళూరు మొత్తం పొడవు 597 కిలోమీటర్లు కాగా.. తెలంగాణలో 239 కి.మీ., ఆంధ్రప్రదేశ్‌లో 264 కి.మీ., కర్ణాటకలో 94 కి.మీ. మేరకు ఉంటుంది. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ, ఆమనగల్లు, మన్ననూర్/ పెన్మిల, సోమశిల, మనరాష్ట్రంలో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం.. కర్ణాటకలో అలిపురా, దేవనహళ్లి, కొడిహళ్లి కలిపి మొత్తం 15 స్టేషన్లు నిర్మించనున్నారు.



## టీడీపీ, జనసేన నుంచి 60 కుటుంబాలు
# వైసీపీలో చేరిక

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ధర్మాన కృష్ణదాస్**

**శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి, జూన్ 21 (ఆంధ్ర మనం):** శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ వి కన్వెన్షన్ లో ఇచ్ఛాపురం సమన్వయకర్త సాడే శ్యాం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన సుమారు 60 కుటుంబాలు వైఎస్సార్ సీపీ పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వంపై వీరు అసంతృప్తి చెంది వైఎస్ఆర్ సీపీ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు ధర్మాన కృష్ణదాస్ వీరికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ దాస్ మాట్లాడుతూ, రాబోయేది వైయస్ జగన్ ప్రభుత్వం అని ప్రతి కార్యకర్తకు మంచి రోజులు వస్తాయని అన్నారు . కూటమి ప్రభుత్వం పై అసంతృప్తి చెంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లోకి వస్తున్న కూటమి నాయకులకు సాదర స్వాగతం పలుకుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకులు దుంపల లక్ష్మణరావు ,రాష్ట్ర కళింగ విభాగం అధ్యక్షులు ఆరంగి మురళీధర్, ఎంపీపీలు నిమ్మన దాస్ , దేవదాస్ రెడ్డి , జెడ్పీటీసీ తడక జోగారావు , నర్తు నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమావేశం కాదు
# ఆత్మావలోకన భయం

**రాజమహేంద్రవరం జూన్ 21 (ఆంధ్ర మనం):** వైసీపీ కాపు నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం ఆత్మీయ సమావేశం కాదని, అది జగన్ రెడ్డి ఐదేళ్ల తుగ్లక్ పాలనలో కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, సమాజానికి ద్రోహం చేశాక... "రేపు మనకు పుట్టగతులు ఉంటాయా, మన రాజకీయ భవిష్యత్తు ఏంటి" అని భయంతో ఏడుస్తూ చేసుకుంటున్న "ఆత్మావలోకన" సమావేశం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. రాజమహేంద్రవరంలోని హుకుంపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి దుర్గేష్ వైసీపీ నేతల కపట నాటకాలను తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ.. పిఠాపురంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేతిలో ఘోరంగా ఓడిపోయిన దుర్దశ, ఫ్రస్ట్రేషన్ భరించలేకే వంగా గీత ఇవాళ కూటమి ప్రభుత్వంపై, మా నాయకుడు పవన్ కళ్యాణ్ పై విషం చిమ్ముతున్నారు. పిఠాపురంలో ఆమె పర్మినెంట్ అడ్రస్ గల్లంతైందనే బాధే ఆవిడ మాటల్లో కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఎక్కడినుండైనా పోటీ చేసే హక్కు, స్వేచ్ఛ జనసేనాని పవన్ కళ్యాణ్ కు ఉన్నాయి. పిఠాపురం శ్రీపాద వల్లభుడిపై ఉన్న భక్తితో, ఆ ప్రాంతాన్ని వందల కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతోనే ఆయన అక్కడ పోటీ చేసి చారిత్రాత్మక విజయం సాధించారు. మరి మీ జగన్ రెడ్డికి అంత దమ్ముంటే... కేవలం పులివెందుల కోటకే ఎందుకు పరిమితమయ్యాడు? వేరే నియోజకవర్గం నుండి పోటీ చేసే సాహసం ఎందుకు చేయలేకపోయాడో వైసీపీ కాపు నేతలు సమాధానం చెప్పాలి అని నిలదీశారు. విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఉంది కాబట్టే, ఆ కుటుంబం ప్రభుత్వాన్ని సంప్రదించి నమ్మకం వ్యక్తం చేసిందన్నారు. మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విచారణ జరిపిస్తూ సీఐని సస్పెండ్ చేశాం. తూర్పుగోదావరి ఎస్పీని స్పెషల్ ఆఫీసర్‌గా పెట్టి ఎంక్వైరీ చేయిస్తున్నాం. చట్టం ముందు ఎవరైనా ఒకటే... తప్పు చేసిన వాడు ఎంతటివాడైనా సరే చట్టం నుండి తప్పించుకోలేడని స్పష్టం చేశారు. నాడు శ్రీకాళహస్తిలో కొట్టె సాయిపై వైసీపీ అరాచక శక్తులు దాడులు చేస్తే, ఈ రోజు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న ఏ ఒక్క వైసీపీ కాపు నేత అయినా కనీసం పరామర్శకు వెళ్ళారా? అని మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు. ఆ రోజు రక్షకుడిగా నిలబడింది ఒక్క పవన్ కళ్యాణ్ మాత్రమే! తిరుపతి వెళ్లి జిల్లా ఎస్పీతో మాట్లాడి, సాయికి ధైర్యం చెప్పడమే కాకుండా... ఇవాళ అధికారంలోకి రాగానే ఆ సామాన్య కార్యకర్త అయిన కొట్టె సాయిని శ్రీకాళహస్తి టెంపుల్ చైర్మన్‌గా నియమించి అందలం ఎక్కించారు. అది సాయి ఒక్కడికే కాదు- యావత్ జనసేన శ్రేణులకి మా అధ్యక్షుడు ఇచ్చిన ధైర్యం. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏనాడైనా ఒక సామాన్య కార్యకర్తకు ఈ స్థాయి పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. 'దేశం, సమాజం బాగుండాలి... నన్ను కులాల చట్రంలో బంధించవద్దు' అని ఢిల్లీలో పవన్ కళ్యాణ్ చెప్పిన ఉన్నతమైన మాటలను తమ స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ నేతలు వికృతంగా చిత్రీకరిస్తురని అన్నారు. అధికార ముసుగు ముఖాన వేసుకుని, ఐదేళ్లపాటు గద్దెపై కూర్చుని... సొంత కాపు కులానికి అన్యాయం జరుగుతుంటే కళ్లప్పగించి చూసిన చేతకాని వ్యక్తులు మీరు! అని వైసీపీ కాపు నేతలను సూటిగా నిలదీశారు. నాడు మీ జగన్ రెడ్డి కాపు కార్పొరేషన్‌ను ఖూనీ చేస్తుంటే నోళ్లు కుట్టేసుకుని పడి ఉన్న మీరు... ఇవాళ పదవులు పోయాక, ప్రజలు ఛీత్కరించుకున్నాక ఏ ముఖం పెట్టుకుని ఈ హడావిడి చేస్తున్నారు? మీ స్వార్థ రాజకీయాల కోసం కాపు సమాజాన్ని వాడుకోవాలని చూస్తే... ఈసారి కాపు యువత తోలు వలిచి చేతిలో పెడుతుంది, జాగ్రత్త అని మంత్రి కందుల దుర్గేష్ గారు తీవ్రస్థాయిలో హెచ్చరించారు.



# యోగాతో దృఢత్వం.. వికాసం.. ప్రశాంతత

**ప్రతిరోజూ దినచర్యలో భాగంగా యోగ**

**టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర**



**తిరుపతి, జూన్ 21 (ఆంధ్ర మనం) :** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా టీటీడీ పరిపాలనా భవనం వెనుక నున్న పరేడ్ మైదానంలో ఆదివారం ఘనంగా నిర్వహించిన యోగ కార్యక్రమంలో టిటిడి ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొని యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ప్రశాంతతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. శ్రీవారి సేవలో నిత్యం నిమగ్నమై లక్షలాది మంది భక్తులకు సేవలందించే టీటీడీ ఉద్యోగులు యోగను అలవర్చుకుంటే ఆరోగ్యవంతమైన, ఆనందమయమైన జీవితం గడపడంతో పాటు వారి కుటుంబాల్లోనూ సంతోషం వెల్లివిరుస్తుందన్నారు.

గత 14 రోజులుగా క్రమశిక్షణతో యోగ సాధన చేసిన ఉద్యోగులు, సిబ్బందిని ఈవో ప్రత్యేకంగా అభినందించారు. తాను కూడా ఒకప్పుడు బలవంతంగా యోగ ప్రారంభించినప్పటికీ, అది క్రమంగా అలవాటై ఆరోగ్యవంతమైన జీవనశైలికి దారి తీసిందని తన అనుభవాన్ని పంచుకున్నారు.




**14 రోజుల యోగ శిక్షణకు విశేష స్పందన**

టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ మాట్లాడుతూ, గతంలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఒక రోజు మాత్రమే నిర్వహించేవారని, ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర ఆదేశాల మేరకు జూన్ 7 నుండి 21 వరకు 14 రోజుల పాటు టిటిడి సంస్థల్లో విస్తృత స్థాయిలో యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఉద్యోగులందరూ ఇదే స్ఫూర్తితో యోగను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. 'ధ్యాన మూలమిదం జగత్' సీడీ, పుస్తకావిష్కరణ, స్విమ్స్ వారు రూపొందించిన బ్రోచర్‌ను టీటీడీ ఈవో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందు పూజా కార్యక్రమం, జ్యోతి ప్రజ్వలనతో యోగ దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం "ధ్యాన మూలమిదం జగత్", "యోగ – ఒక పరిచయం" సీడీ మరియు పుస్తకాన్ని ఈవో ఆవిష్కరించారు. ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన యోగాసనాలను అధికారులు, సిబ్బంది, విద్యార్థులు సమిష్టిగా అభ్యసించారు.

గత 14 రోజుల యోగ శిక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఈవో ప్రశంసా పత్రాలు అందజేశారు. టీటీడీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పీఆర్వో (ఎఫ్ఏసీ) కుమారి నీలిమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఇన్‌చార్జి కార్యదర్శి డా. మేడసాని మోహన్, సీవీఎస్వో కె.వి. మురళీకృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ డా ఆర్వీ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం


**యోగా దినోత్సవ వేడుకల్లో హోంమంత్రి వంగలపూడి అనిత**



**విశాఖపట్నం, జూన్ 21:** ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం విశాఖపట్నం బీచ్ రోడ్డులోని సాగరిక ఫంక్షన్ హాలులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని సాగరిక ఫంక్షన్ హాల్‌కు మార్చి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్, డీఎఫ్‌వో రవీందర్ ధామా, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, వెంకటరత్నం తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే యోగా అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక యోగాసనాల్లో పాల్గొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా, ధ్యానం అత్యంత అవసరమని హోంమంత్రి పేర్కొన్నారు. చిన్నారుల్లో పెరుగుతున్న డిప్రెషన్, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉత్తమ సాధనమని, ప్రతి ఒక్కరూ దానిని తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగాను ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్రంలో యోగా ఉద్యమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్ర మనం

సోమవారం జూన్ 22 2026



# ఎన్నికల్లో సున్నా... ఇప్పుడు ఖాతాలో ఇరవై!

## పార్లమెంటులో ఐదో పెద్ద పార్టీగా ఎన్‌సీపీఐ?

## ఫిరాయింపులతో కొత్త రాజకీయ సమీకరణాలు!

(ఆంధ్ర మనం, ప్రత్యేక ప్రతినిధి)

దేశ రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఎన్నికల్లో ఒక్క లోక్‌సభ స్థానం కూడా గెలుచుకోని ఒక చిన్న పార్టీ అకస్మాత్తుగా జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారడం ఆసక్తి రేకెత్తిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాజకీయ పరిణామాల నేపథ్యంలో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) పేరు ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు పార్టీకి దూరమై ఎన్‌సీపీఐలో చేరనున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామం నిజమైతే పార్లమెంటులో ఆ పార్టీ స్థానం ఒక్కసారిగా మారిపోతుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పార్టీగా ఉన్న ఎన్‌సీపీఐ, లోక్‌సభలో ఐదో అతిపెద్ద పార్టీగా అవతరించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో అసంతృప్తి పెరిగినట్లు వార్తలు వస్తున్నాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై కాకపోయినా, పార్టీలోని కొన్ని వర్గాల ఆధిపత్యంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కొందరు ప్రజాప్రతినిధులు కొత్త రాజకీయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. విశేషమేమిటంటే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, దాని విధానాలను తీవ్రంగా విమర్శించిన నేతలే ఇప్పుడు కొత్త రాజకీయ సమీకరణాల దిశగా అడుగులు వేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీంతో రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న నానుడి మరోసారి చర్చకు వస్తోంది. ఎన్‌సీపీఐ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా పెద్దగా ప్రభావం చూపిన పార్టీ కాదు. త్రిపురలో జరిగిన ఎన్నికల్లో పరిమిత స్థాయిలో మాత్రమే పోటీ చేసింది. ఆ పార్టీ ప్రధానంగా ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించడం అప్పట్లో విశేషంగా నిలిచింది. అయితే ఇప్పుడు అదే పార్టీ ఫిరాయింపుల ద్వారా రాజకీయంగా బలపడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ సమీకరణాల వెనుక కేంద్ర రాజకీయాల ప్రభావం ఉందన్న ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభలో సంఖ్యాబలం పెంచుకోవడం, భవిష్యత్ రాజ్యాంగ సవరణలు లేదా కీలక బిల్లుల ఆమోదానికి అవసరమైన మద్దతు కూడగట్టుకోవడం వంటి లక్ష్యాలతో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలపై ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు. టీఎంసీ, ఎన్‌సీపీఐ లేదా ఎన్డీఏ వర్గాల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో రాజకీయ వర్గాల దృష్టి ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌పైనే కేంద్రీకృతమైంది. ఈ పరిణామాలు ఎంతవరకు వాస్తవ రూపం దాలుస్తాయో, దేశ రాజకీయాల్లో ఇంకెన్ని కొత్త మలుపులకు దారి తీస్తాయో వేచి చూడాల్సి ఉంది.

# యోగ భారతీయ సంస్కృతికి అమూల్యమైన కానుక

## భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**జబల్‌పూర్, జూన్ 21:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన సామూహిక యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ విదేశాల్లోని యోగా సాధకులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్రపతి, మానవాళికి ఆరోగ్యకరమైన, సమతుల్యమైన, అర్థవంతమైన జీవితాన్ని చూపించిన భారతదేశపు గొప్ప సంప్రదాయాన్ని నేడు ప్రపంచం గౌరవిస్తోందని అన్నారు. యోగ అనేది భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక వికాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్రపతి వివరించారు. వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడులు, అనారోగ్య సమస్యలను ఎదుర్కోవడంలో యోగ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో యోగకు పెరుగుతున్న ఆదరణ భారతీయ జ్ఞాన సంపద గొప్పతనానికి నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన ప్రజలను యోగ ఒకే వేదికపైకి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని “ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగ” అనే ప్రధాన అంశంతో నిర్వహించడం ఎంతో సముచితమని రాష్ట్రపతి అన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగ సాధన ద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని సూచించారు. యోగను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చిన రాష్ట్రపతి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ అత్యంత ప్రభావవంతమైన సాధనమని పేర్కొన్నారు. యోగ ద్వారా శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యోగా సాధకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# భారత నౌకాదళంలో మూడు కొత్త యుద్ధ నౌకలు


- కోల్‌కతాలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- సముద్ర భద్రతలో మరో కీలక అడుగు
- ఆత్మనిర్భర్ భారత్‌కు నిదర్శనమన్న మోదీ




**కోల్‌కతా, జూన్ 21:** భారత నౌకాదళ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా ఐఎన్ఎస్ దునాగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధాని నరేంద్ర మోదీ కోల్‌కతాలో అధికారికంగా జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా దేశ రక్షణ రంగంలో స్వావలంబన సాధనకు భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ నౌకలు భారత సముద్ర భద్రతను మరింత పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాని తెలిపారు. దేశ సముద్ర సరిహద్దుల రక్షణ, వ్యూహాత్మక అవసరాల నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ సామర్థ్యాల పెంపులో ఇవి ఉపయోగపడనున్నాయని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, దేశీయ రక్షణ తయారీ రంగ సామర్థ్యాలతో ఈ నౌకలు రూపొందించబడటం విశేషమని మోదీ పేర్కొన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ స్వయం సమృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు. భారత నౌకాదళం ఆధునికీకరణలో భాగంగా కొత్త సాంకేతికతతో రూపొందించిన యుద్ధ నౌకలు, సర్వే నౌకలు, సహాయక నౌకలను దశలవారీగా సేవల్లోకి తీసుకువస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం మరింత బలపడనుంది. ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో సముద్ర భద్రతకు ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో ఈ నౌకల చేరిక కీలకమని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సముద్ర మార్గాల్లో జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు ఇవి తోడ్పడనున్నాయి. ఖభారత నౌకాదళం శక్తివంతంగా మారడం ద్వారా దేశ భద్రతతో పాటు స్వదేశీ రక్షణ పరిశ్రమకు కూడా కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశీయ తయారీ సామర్థ్యాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడుతున్నాయని ఆయన వెల్లడించారు.

# విద్యార్థుల కోసం మోదీ నిరీక్షణ

- నీట్ పరీక్షకు ఆటంకం కలగకుండా నిర్ణయం
- 45 నిమిషాలపాటు విమానాశ్రయంలోనే ప్రధాని
- విద్యార్థుల ప్రయోజనాలకే ప్రాధాన్యం



**న్యూఢిల్లీ, జూన్ 21:** విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక పరీక్ష సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారు. కోల్‌కతాలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన వెంటనే తన అధికారిక నివాసానికి వెళ్లకుండా అక్కడే నిరీక్షించారు. సాధారణంగా ప్రధాని ప్రయాణాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించడం వంటి చర్యలు చేపడతారు. అయితే అదే సమయంలో దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష జరుగుతుండటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే వేళ ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదని భావించినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 1.15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని సుమారు 45 నిమిషాలపాటు అక్కడే ఉన్నారు. నీట్ పరీక్ష ప్రారంభ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో తన కాన్వాయ్ ప్రయాణం వల్ల ట్రాఫిక్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు సూచించినట్లు సమాచారం. దీంతో పరీక్ష రాసే విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు.

నీట్ పరీక్ష దేశంలోని అత్యంత కీలక ప్రవేశ పరీక్షల్లో ఒకటి. వైద్య విద్యలో ప్రవేశాల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాల్సి ఉండటంతో రహదారులపై చిన్న అంతరాయం కూడా అభ్యర్థులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంటుంది. ఈ అంశాన్ని ప్రధాని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన తర్వాత మాత్రమే ప్రధాని విమానాశ్రయం నుంచి బయల్దేరి తన అధికారిక నివాసానికి వెళ్లారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో వారికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించిన ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

# నీట్ రీఎగ్జామ్..

## 22 లక్షల మంది హాజరయ్యే ఛాన్స్

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది వరకు అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా. గత నెల 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో రద్దైన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష జరిపే నిర్వహణా సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీయే) దీన్ని రద్దు చేసింది. తిరిగి ఇవాళ మరోసారి పరీక్ష నిర్వహిస్తోంది. గత అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్ష నిర్వహిస్తోంది. పోలీసులతోపాటు, సీఆర్పీఎఫ్ సహా వివిధ విభాగాలకు చెందిన భద్రతా బలగాల పహారా మధ్య పరీక్ష ప్రారంభమైంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష జరగనుంది. గతంలో మూడు గంటలు.. అంటే మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే పరీక్ష జరిగేది. కానీ, ఈసారి అభ్యర్థుల సౌకర్యార్థం 15 నిమిషాలు అదనంగా సమయం కేటాయించారు. అలాగే, రఫ్ వర్క్ కోసం బుక్‌లెట్‌లో అదనపు పేజీల్ని కూడా కేటాయించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ ఫార్ములా కోంస ఈ రఫ్ వర్క్ పేపర్స్ ఉపయోగపడతాయి. దేశవ్యాప్తంగా 551 పట్టణాలు, నగరాల్లో 5,440 కేద్రాల్లో ఈ పరీక్ష జరుగుతోది. ఇందులో 14 విదేశీ కేంద్రాలు కూడా ఉన్నాయి. ఇంగ్లీష్‌తోపాటు 12 ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్ష ఉంటుంది. దాదాపు 95,000కుపైగా గదులను పరీక్ష కోసం కేటాయించారు. అన్నింట్లోనూ సీసీటీవీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా దాదాపు 1,38,560 కెమెరాలు, 51,311 జామర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థుల్ని పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు అనుమతి ఉంది. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. పరీక్షలు జరిగే చోట అధికారులు ప్రత్యేక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేశారు.

# యోగా మానవాళిని ఏకం చేస్తుంది

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- షిల్లాంగ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
- యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపు
- తూర్పు వైమానిక దళ కేంద్రంలో యోగాభ్యాసం



**షిల్లాంగ్, జూన్ 21 :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని తూర్పు వైమానిక దళ కమాండ్ కేంద్రంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు సాధించిన ఆయన యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగం కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, ప్రపంచవ్యాప్తంగా మానవాళిని ఒకే వేదికపైకి తీసుకువచ్చే జీవన విధానమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశాలు, ఖండాలు, సంస్కృతుల మధ్య ఉన్న భేదాలను అధిగమించి ప్రజలను ఏకం చేసే శక్తి యోగాకు ఉందని అన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని ఆయన చెప్పారు. శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. భారతదేశం వేల ఏళ్ల క్రితం ప్రపంచానికి అందించిన ఈ అమూల్యమైన సంపద నేడు కోట్లాది మందికి ఆరోగ్యవంతమైన జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాభ్యాసానికి కేటాయించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు. ఆరోగ్యకర జీవనశైలికి యోగా ఉత్తమ మార్గమని మరోసారి ఈ వేడుకలు చాటిచెప్పాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# యోగాతో విద్యార్థుల్లో ఏకాగ్రత, చదువుపై ఆసక్తి పెంపు

**పిడుగురాళ్ల , జూన్ 21, ఆంధ్ర మనం :**



పిడుగురాళ్ల పట్టణంలో మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఆదివారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్త మల్లికార్జున రావు మాట్లాడుతూ.. హైస్కూల్ విద్యార్థులకు యోగా ఎంతో మేలు చేస్తుంది. ఇది వారి చదువుల ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తుంది. యుక్తవయస్సులో వచ్చే మానసిక కల్లోలాలను, భావోద్వేగాలను నియంత్రించడానికి యోగా ఒక అద్భుతమైన మార్గం అన్నారు. విద్యార్థుల చదువు, శ్వాస మీద ధ్యాసను అలవాటుచేస్తే లాభం ఉంటుంది. పాఠశాలల్లో యోగాను ప్రవేశపెట్టడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనం ఒత్తిడి తగ్గిస్తుంది. చదువుల పోటీ, పరీక్షల భయం వల్ల కలిగే ఆందోళనను తగ్గిస్తుంది.ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. శ్వాస, వ్యాయామాలు, ధ్యానం వల్ల మెదడు చురుగ్గా పనిచేసి, చదువుపై దృష్టి పెరుగుతుంది. శారీరక ఆరోగ్యం రోజూ ఒకేచోట కూర్చొని చదవడం వల్ల వచ్చే నొప్పులు తగ్గి, శరీరం వంగే గుణం, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. యోగాసనాలవలన విద్యార్థుల్లో క్రమశిక్షణ, సహనాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్త మల్లిఖార్జునరావు, అసిస్టెంట్ చిహెచ్ శంకర నారాయణ, పుల్లారావు, బిఎస్ఎన్ రాజు, కొండలు, విశ్వరూపచారి,చిహెచ్ ప్రీతి మేడం, పీడీ లు డేనియల్, మోహనకుమారి, ఎస్ వి ఆర్ సౌజన్య, ఇమ్మానుయేలురాజు, గోపినాయక్, పవిత్ర, ఎస్.కె అంజసాహెబ్,తల్లితండ్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**శ్రీకాకుళం, జూన్ 21, ఆంధ్ర మనం:**



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైల్ అహ్మద్ మౌలానా సూచనల మేరకు ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే ప్రధాన అంశంతో దీనిని ఏర్పాటు చేశారు. దైనం దిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవాలని, శారీరక దారుఢ్యానికి, మానసిక ప్రశాంతతకు యోగాసనాలు ఎంతో తోడ్పడతాయని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె హరిబాబు పాల్గొన్నారు. అడిషనల్ సివిల్ జడ్జి ఆర్. శాంతి శ్రీ, స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కుమారి వి. శాంతి, జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ కె. అనురాగ్, కోర్టు సిబ్బంది హాజరై యోగా విశిష్టతను చాటారు.

# ఆధునీకరించిన శాఖా గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా

**గాజువాక, జూన్ 21 ఆంధ్ర మనం:**



జీవీఎంసి 67 వ వార్డు కొత్త గాజువాకలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సీఎస్సార్ నిధులు 15 లక్షలతో ఆధునీకరించిన శాఖా గ్రంధాలయాన్ని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞాన గనులని అన్నారు.కేవలం చదువుకే కాకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని అన్నారు.విద్యార్థులు కావాల్సిన మేధాశక్తిని సంపాదించుకోవడానికి ఇది ఒక ప్లాట్ ఫాం అని పేర్కొన్నారు.కాంపిటీటీవ్ ఎగ్జామ్స్ కు ప్రిపేర్ కావడానికి కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు లభ్యమయ్యే గ్రంధాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సామాజిక సేవలో కోరమండల్ యాజమాన్యం చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో లేబొరేటరీల ఏర్పాటు చేయడంలో కూడా ఈ సంస్థ చేస్తోన్న కృషి గొప్పదని కొనియాడారు.వార్డు మాజీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోరమండల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.షణ్ముగం,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్,డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు,కోరమండల్ హెచ్ ఆర్ హెడ్ కెవివివైఎస్ నారాయణ,సీనియర్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు,సీఎస్సార్ మేనేజర్ వెంకట రమణ,నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,బీజేపీ నాయకులు గూటూరు శంకరరావు,జిల్లా గ్రంధాలయ సంస్థ సెక్రెటరీ బుర్రి కుమార్ రాజు,వార్డు జనసేన నాయకులు గొలగాని గోపీ,గ్రంధాలయ అధికారిణి బి.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ కి రెండు లక్షలు చెక్కు అందజేత

**గాజువాక, జూన్ 21 ఆంధ్ర మనం:**



గాజువాక నియోజకవర్గం లోని 66వ వార్డులో నివాసముంటున్న మైనారిటీ షేక్ తాజావాలి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన అనారోగ్యం వలన వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ గాజువాక శాసనసభ్యులు, రాష్ట్ర తెలుగుదే శం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకు రావడంతో ఆయన స్పందిం చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయలు మంజూరు చేయించి ఆ చెక్ ని ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందజేశారు. వార్డ్ అధ్యక్షులు గోమాడ వాసు, వైస్ ప్రెసిడెంట్ హాఫిజ్ రెహమాన్, నియోజవర్గం మైనార్టీ అధ్యక్షులు రహమాన్ , 66 వార్డు మైనార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ భాషా తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు.

# అబ్దుల్ అజీజ్‌కు మైనార్టీ నాయకుల ఘన సన్మానం

**నెల్లూరు, జూన్ 21 ఆంధ్ర మనం :**



నెల్లూరు నగరంలోని హరనాధపురం లో గల ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ నివాసంలో ఆయనను ముస్లిం మైనారిటీ నాయకులు సమీ హుస్సేనీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక జెండా వీధి నుంచి బైక్ ర్యాలీగా వచ్చి సేరా తొడిగించి అజీజ్ ను ఘనంగా సన్మానించుకున్నారు. అనంతరం దువా చేసి, కేక్ కటింగ్ నిర్వహించారు. టిడిపి సీనియర్ లీగల్ సెల్ నాయకులు నన్నే సాహెబ్ రూ.20 వేలు నెల్లూరు పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షులు రియాజ్ భాష రూ.20 వేలు చెక్కులను తాలీం ఏ హునర్ కు విరాళంగా అందించారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏపీ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో తాలిం ఏ హునర్ కార్యక్రమం నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా సమీ హుస్సేనీ మాట్లాడుతూ, ధనవంతులు బిడ్డలు ఎక్కడ చదువుతున్నారో పేద విద్యార్థులను కూడా అక్కడే చదివిస్తున్నారని అన్నారు. పేద విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా మార్చి వారిని దేశానికి వెన్నెముకల తయారు చేస్తున్న అబ్దుల్ అజీజ్ కు నా సలాములు అన్నారు. సాబీర్ ఖాన్ మాట్లాడుతూ దేశంలో అత్యున్నత పోటీ పరీక్షలకు పోటీపడేలా ఈ విద్యార్థులను తయారు చేస్తున్నారని అన్నారు. అబ్దుల్ అజీస్ ఆయన రాజకీయ జీవితంలో ఎన్నో మార్క్ లు సృష్టించారని, ఆ మార్క్ లను మార్చాలంటే మరో అబ్దుల్ అజీజ్ ఏ రావాలని అన్నారు. హయత్ బాబా మాట్లాడుతూ అబ్దుల్ అజీజ్ చేయగలిగిందే చెప్పారని చెప్పింది తూచా తప్పకుండా చేసి చరిత్ర సృష్టించారని అన్నారు. వక్ఫ్ బోర్డు బాధ్యతలు ఇలా కూడా నిర్వర్తించవచ్చని నిరూపించి, దేశవ్యాప్తంగా ఉన్న చైర్మన్ లకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. శంషుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించిన సంఘటన తాలీం ఏ హునర్ అని కొనియాడారు. దేశంలో డబ్బు వల్ల గొప్పవారైన వ్యక్తులు అతి తక్కువ మందిని కేవలం విద్య వల్లే అనేకమంది గొప్ప వారయ్యారని అన్నారు. ఒక విద్యావంతుడు పదవి అధిరోహిస్తే ఎలా ఉంటుంది అనడానికి అబ్దుల్ అజీజ్ నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో ఖాజావలి, ఇంతియాజ్, అన్వర్, ఇక్బాల్, పాషా మొహిద్దిన్, ఖాదర్ బాషా, జుబేర్, మైజుల్లా హుసేని తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడి, ఆందోళనను అధిగమించడంలో యోగా కీలకం

**• కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం,జూన్,21, ఆంధ్ర మనం:**




ఒత్తిడి, ఆందోళన, అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డచ్ భవనం వద్ద ఆదివారం భారీ ఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. సామూహిక యోగాభ్యాసం, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాలను నిర్వహించారు. యోగా ద్వారా శరీర దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందడంతో పాటు సమగ్ర ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. జూన్ 7వ తేదీ నుండి ప్రతి ఒక్క గ్రామం నుంచి మండల స్థాయి వరకు యోగా పై వివిధ రకాల పోటీలు నిర్వహించడమైనదన్నారు. కాంపిటీషన్స్ పెట్టడం, 4,50,000 వరకు రిజిస్ట్రేషన్స్ అయినట్లు చెప్పారు. ప్రతి ఒక్క వ్యక్తికి యోగా నేర్పిస్తూ వాళ్ళకి ఒక యోగా సర్టిఫికెట్ కూడా అందజేసినట్లు చెప్పారు. కొత్తగా నిర్మించిన కార్గిల్ పార్క్ వద్ద ఒక యోగా ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. యోగా కోసమే స్పెసిఫిక్ గా ఉంటుందన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె. వి. మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ ఒక్క రోజే కాకుండా మనం ప్రతీ రోజు చేస్తే ఇది మనకందరికీ కూడా ఆరోగ్యం పరంగా చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. యోగా సోలో, సింక్రోనైజ్డ్, యోగ స్లొగన్స్, వ్యాసరచన, తదితర యోగా పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికేట్లు, మెమెంటోలను బహూకరించారు. అంతకుముందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యోగా పై గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగి పాడి వినిపించారు. అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా గురువులు పాండ్రంకి మురళీకృష్ణ, పతంజలి నుండి చినబాబు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ నుండి సుధారాణి తదితరుల యోగాసనాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, జిల్లా పరిషత్ సిఈఓ వెంకటరామన్, డిఆర్డీఎ పిడి కిరణ్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హెచ్. కూర్మారావు, డిఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి వినాయక, ఆర్ అండ్ ఎస్ఈ ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

**• కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి**

విజయనగరం, జూన్ 21, ఆంధ్ర మనం:




అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లాలో యోగా వేడుకలు అంబరాన్నంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర-2026' ముగింపు కార్యక్రమంలో భాగంగా, విజయనగరం పట్టణంలోని నిర్వహించిన యోగా కార్యక్రమం ఘనంగా సాగింది. వేలాది మంది యోగా సాధకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకే చోట చేరి ఆసనాలు వేయడంతో అంబేద్కర్ జంక్షన్ (బాలాజీ జంక్షన్) యోగామయమైంది. ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యమైన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏ.ఆర్. దామోదర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, డిఆర్వో సిహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. వీరంతా స్వయంగా యోగాసనాలను వేసి, ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్పించి స్ఫూర్తిని నింపారు. "యోగా చేద్దాం - ఆరోగ్యాన్ని పొందుదాం" అంటూ నినదిస్తూ, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. ఆధునిక జీవనశైలిలో కుటుంబ పోషణ, పనుల ఒత్తిడిలో పడి చాలామంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. నిరంతరం యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది. ప్రతి ఒక్కరూ రోజు కనీసం 10 నిమిషాలైనా యోగా కోసం కేటాయించాలని కోరారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరికి ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అవసరమని పేర్కొన్నారు. మత్తుమందు, డ్రగ్స్ అలవాటు చేసుకొని, యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో యోగా ఒక భాగమని చెప్పారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ కలిసికట్టుగా యోగ సాధన చేయడం ద్వారా ఇతరుల్లో స్ఫూర్తి కలుగుతుందని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణలో పాల్గొన్న యోగా గురువులను, ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో యోగాంధ్ర జిల్లా సమన్వయకర్త, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస పాణి, మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, యోగాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ వరప్రసాద్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, కూటమి నాయకులు, ఆయుష్, డిఆర్డిఏ శాఖల సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు వేలాదిమంది పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**గాజువాక జూన్ 21, ఆంధ్ర మనం.**

సీఎం సహాయ నిధికి అర్జీలు పెట్టుకున్న 24 మందికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు.గాజువాక నియోజవర్గంలో తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు గాజువాక శాసనసభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న సుమారు 24 మంది లబ్ధిదారులకు ఆదివారం గాజువాక పార్టీ కార్యాలయంలో 36 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అసమర్థత విధానాల వలన ఆర్థిక ఇబ్బందులు ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి మరియు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 72వ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అక్కిని లక్ష్మణరావు, 66వ వార్డ్ అధ్యక్షులు గోమాడ వాసు, 74వ అధ్యక్షులు వియ్యపు కొండబాబు, 73వ వార్డ్ క్లస్టర్ ఇంచార్జ్ నాయుడు, గాజువాక మైనార్టీ సెల్ అధ్యక్షులు రహిమాన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# గిద్దలూరులో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**గిద్దలూరు, జూన్ 21ఆంధ్ర మనం :**




గిద్దలూరు బీజేపీ పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు), గిద్దలూరులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని వక్తలు సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు కలిసి యోగా సాధనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సిద్ధేశ్వర శర్మ, ఉపాధ్యాయులు ఏ. విశ్వరూప చారి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దూదేకుల బాదుల్లా, మారుతి ప్రసాద్, ఎం. పుల్లయ్య, డి. మహేష్, రామకృష్ణ, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ బుద్ధ యోగా సెంటర్ ఆధ్వర్యంలో..

**పెదగంట్యాడ, జూన్ 21 ఆంధ్ర మనం:**



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భముగా 75 వ వార్డు జీవీఎంసీ మైదానంలో గౌతమ బుద్ధ యోగా అండ్ మీడియేషన్ సెంటర్ ఆధ్వర్యములో ఆదివారం యోగా దినోత్సవం నిర్వహించారు.యోగా గురువు దేవాడ ఈశ్వర రెడ్డి ఆధ్వర్యములో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమ సంస్థ ఇక్కడ యోగా చేసుకోవడానికి అవసరం అయిన అన్ని సదుపాయాలు కల్పించిన 75 వ వార్డు మాజీ కార్పొరేటర్ మరియు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ని దుశ్శాలువతో సన్మానించి తమ అభిమానాన్ని తెలియ చేశారు. అనంతరం పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ యోగా మన దేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆరోగ్య ప్రదాయిని అని , ఇది మన దేశంలో పుట్టి ప్రపంచం మొత్తం ఇప్పుడు వేడుకగా చేసుకునే పరిస్థితికి వచ్చిందన్నారు.ఈ కార్యక్రమములో పిట్ట గురునాథ్ రెడ్డి, నీలాపు పరదేశి, పైడిరాజు, జ్యోతి, సాహిత్య, లావణ్య, అప్పల రెడ్డి, రమణా రెడ్డి ఇతర యోగా సభ్యులు పాల్గొన్నారు.

# యోగా మన పూర్వీకులు అందించిన అమూల్యమైన వరం

- ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా సెల్ కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి

**అగనంపూడి, గాజువాక జూన్ 21 ఆంధ్ర మనం :**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర–2026 కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలోని అగనంపూడి జనరల్ ఆసుపత్రి లో ఆదివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర మీడియా సెల్ కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా వెన్నా శ్రీరామమూర్తి మాట్లాడుతూ యోగా కేవలం ఒక వ్యాయామ విధానం మాత్రమే కాకుండా సంపూర్ణ జీవన విధానమని పేర్కొన్నారు. "యోగా అనేది ఒక జీవిత విధానం", "యోగా ఫర్ హెల్తీ ఏజింగ్" అనే సందేశాలతో



యోగా ప్రాముఖ్యతను వివరించారు. గత ఏడాది జూన్ 21న కెనడాలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో తను ప్రత్యేక అతిథిగా పాల్గొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని 56 పర్యాటక కేంద్రాలు, 24 ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా శిక్షకులను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. యోగా ప్రయోజనాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. యోగా ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగంగా ఆచరించాలని వెన్నా శ్రీరామమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపీకృష్ణ, ఏఓ రవిరాజు, మాజీ కార్పోరేటర్ రౌతు శ్రీనివాసరావు, కర్రి దశేంద్ర, సోమశేఖర్, కోసూరి తాతారావు, దొక్కారమేష్ , దాసరి త్రినాథ్, రమణమ్మ , కూటమి నాయకులు ,హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పునః పరీక్షలు

- కట్టుదిట్టమైన భద్రత మధ్య నీట్ రీ-ఎగ్జామినేషన్ నిర్వహణ
- కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, జూన్ 21 ఆంధ్ర మనం :**

జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పునః పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీట్ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం, జిల్లాలో మొత్తం 1,521 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, వారిలో 1,401 మంది



హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు.

**అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి:**

- కేటాయించిన పురుష అభ్యర్థులు – 432 మంది
- కేటాయించిన మహిళా అభ్యర్థులు – 1,089 మంది
- హాజరైన పురుష అభ్యర్థులు – 407 మంది
- హాజరైన మహిళా అభ్యర్థులు – 994 మంది
- మొత్తం హాజరైన అభ్యర్థులు – 1,401 మంది
- గైర్హాజరైన అభ్యర్థులు – 120 మంది

మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, దివ్యాంగ (పి.డబ్ల్యు.డి.) అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కేటాయించి సాయంత్రం 6.15 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు శాఖ, ఇంటెలిజెన్స్ విభాగాల సమన్వయంతో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం ఆన్సర్ షీట్లను నిర్దేశిత భద్రతా నిబంధనల ప్రకారం పోస్టల్ వ్యవస్థ ద్వారా సంబంధిత అధికారులకు పంపించే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు తాగునీరు, బిస్కెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

# యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి

- యోగాంధ్ర–2026కు నంద్యాల జిల్లాలో విశేష స్పందన
- జిల్లావ్యాప్తంగా 4,700 కేంద్రాల్లో సుమారు 4 లక్షల మంది భాగస్వామ్యం
- కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, జూన్ 21 ఆంధ్ర మనం:**

యోగం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో యోగాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాలను సమిష్టిగా నిర్వహిస్తూ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో గత 14 రోజులుగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించినట్లు తెలిపారు. వృత్తిపరమైన మరియు వ్యక్తిగత జీవితాల్లో సమతుల్యత సాధించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. శ్రీశైలం, మహానంది వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల్లో నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమాల్లో ఒక్కో చోట దాదాపు రెండు వేల మంది చొప్పున పాల్గొనడం విశేషమన్నారు. యోగా అసోసియేషన్ల సహకారంతో నిర్వహించిన థీమాటిక్ యోగా




కార్యక్రమాలు కూడా ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4,700 కేంద్రాల్లో నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో సుమారు 4 లక్షల మంది ప్రజలు భాగస్వాములై యోగాపై తమ ఆసక్తిని చాటుకున్నారని వెల్లడించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని కలెక్టర్ పేర్కొన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు యోగాను ఆచరిస్తున్నాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ "యోగ ఫర్ హెల్దీ ఏజింగ్" కావడంతో ప్రతి ఒక్కరూ తమ వయస్సు, శారీరక పరిస్థితులకు అనుగుణంగా యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువత తప్పనిసరిగా యోగా సాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తి, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అసెంబ్లీ సమయంలో యోగా నిర్వహిస్తున్నామని, ఇదే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ప్రతిరోజూ యోగా సాధనకు సమయం కేటాయించాలని కోరారు. యోగా ద్వారా విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యుత్తమ సంపదలలో ఒకటని పేర్కొన్నారు. జీవితంలో ఎన్నో పరధ్యానాలు ఉన్నప్పటికీ యోగా మనలోని శక్తిని లక్ష్యసాధన వైపు కేంద్రీకరించగలదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు రోజుకు 20 నుండి 30 నిమిషాలు యోగా సాధన చేస్తే తమ లక్ష్యాలను మరింత సులభంగా సాధించగలరని చెప్పారు. నిత్యం బిజీ జీవితాన్ని గడిపే ఉద్యోగులు, అధికారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఉదయం, సాయంత్రం లేదా కార్యాలయాల్లో లభించే కొద్ది సమయాన్ని కూడా యోగా సాధనకు వినియోగించుకోవచ్చని సూచించారు. యోగా ఒక రోజు కార్యక్రమంగా కాకుండా జీవితాంతం కొనసాగించే ఆరోగ్యకరమైన అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కనీసం మరో ఐదుగురికి యోగా ప్రాముఖ్యతను వివరించి వారిని కూడా యోగా వైపు ప్రోత్సహించాలని కోరారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే యోగాంధ్ర కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయుష్ యోగా తెరపిస్ట్ మయూరాసనం, శిరశాసనం, సర్వాంగాసనం, చక్రాసనం, బకాసనం వంటి యోగాసనాలను వేసి ప్రాముఖ్యతను వివరించారు. పాణ్యం మండలం విద్యార్థులు సమన్వయ యోగా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. యోగాంధ్ర–2026 విజయవంతానికి సహకరించిన ఆకాంక్ష యోగా సమితి, అమర యోగ వికాస కేంద్రం, ఇషా ఫౌండేషన్, హార్ట్‌ఫుల్‌నెస్, నేచురోపతి అండ్ యోగా సంస్థలు, ప్రజాపిత బ్రహ్మకుమారీస్, శ్రీ సత్యసాయి ధ్యాన మండలి, స్పోర్ట్స్ యోగాసన అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. అలాగే 14 రోజులపాటు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఆయుష్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, క్రీడా అభివృద్ధి శాఖ, పోలీసు శాఖ, సివిల్ సప్లైస్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి, జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# మైనార్టీల సంక్షేమానికి అండగా ఉంటాం

- తబ్లీగీ జమాత్ ప్రతినిధులతో భేటీలో ఎంపీ కేశినేని చిన్ని

**విజయవాడ , జూన్ 21 ( ఆంధ్ర మనం) :**

మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పాతపాడు వద్ద నిర్మించనున్న తబ్లీగీ జమాత్ రాష్ట్ర కార్యాలయం, మసీదు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ జమాత్ ప్రతినిధులు ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. మైనారిటీల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి అవస



రమైన సహకారం అందించేందుకు తన కార్యాలయం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. మతాలకు అతీతంగా ప్రజలందరికీ సేవ చేయడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని చెప్పారు.సమాజంలో సోదరభావం, సామరస్యం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మత, సామాజిక సంస్థలు ప్రజల్లో మంచి విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. తబ్లీగీ జమాత్ చేపడుతున్న కార్యక్రమాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రతినిధులతో చర్చించిన ఎంపీ, కార్యక్రమానికి తన వంతు సహకారం అందించడంతో పాటు హాజరవుతానని హామీ ఇచ్చారు. దీనిపై తబ్లీగీ జమాత్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో తబ్లీగీ జమాత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అక్బర్, జమాత్ పెద్దలు అహ్మద్, హుస్సేన్, టీడీపీ సీనియర్ నాయకుడు బొప్పన భవకుమార్, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆషా, పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు తమీం అన్సార్, ఇర్ఫాన్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**

**గిద్దలూరు, జూన్ 21 ఆంధ్ర మనం :**




గిద్దలూరు నియోజకవర్గం బేస్తవరిపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని తెలిపారు. గత రెండు సంవత్సరాలలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బేస్తవరిపేట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుపతి(టిటిడి),జూన్ 21,ఆంధ్ర మనం:**




టీటీడీ ఆధ్వర్యంలో నిరుపేద రోగులకు ప్రాణదాతగా సేవలందిస్తున్న శ్రీ వేంకటేశ్వర ప్రాణదానం ట్రస్ట్‌కు హైదరాబాద్‌లోని షేక్‌పేట్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకులు, చైర్మన్ అన్నే శ్రీనివాసరావు రూ.1 కోటి విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళానికి సంబంధించిన డిడిని ఆదివారం తిరుపతిలోని టీటీడీ ఈవో నివాస కార్యాలయంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర కు అందించారు. ఈ సందర్భంగా ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు ఉదారంగా రూ.కోటి విరాళం అందించిన దాత అన్నే శ్రీనివాసరావును ఈవో అభినందించి, వారి సేవాభావాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు ఎన్. సదాశివరావు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులను సన్నద్ధం చేద్దాం

**నంద్యాల, జూన్ 21,ఆంధ్ర మనం:**

ఎల్నినో వర్షభావ పరిస్థితిని ఎదుర్కొనేందుకు నంద్యాల జిల్లా రైతులను సన్నద్ధం చేద్దామని నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న. వెంకటేశ్వర్లు ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రేపటినుండి శనివారం వరకు ప్రతి గ్రామంలో రైతన్న– మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనీ, ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు గ్రామంలో ప్రతి రైతు కుటుంబాన్ని కలిసి ప్రభుత్వం ద్వారా అమలు చేయబడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పాంప్లెట్స్ ను పంపిణీ చేయాలన్నారు. రాబోతున్న ఎల్నినో కరువు పరిస్థితుల అనుసరించి, రైతులు వరి పంటను తగ్గించి మినుము పెసర కంది తదితర అపరాల పంటలు, సోయాబీన్ వేరుశనగ, పొద్దు తిరుగుడు లాంటి నూనెగింజల పంటలు , కొర్ర, సజ్జ వంటి చిరుధాన్యాల పంటలను సాగు చేయుటకు, పంట మార్పిడి కొరకు రైతులను సమాయత్తం చేయాలన్నారు. అలాగే ఏపీ ఎయిమ్స్ ఫార్మర్స్ యాప్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న ఎరువుల పంపిణీ గురించి రైతులకు తెలియజేయాలని, పి ఎం డి ఎస్ ప్రకృతి వ్యవసాయం సాగు పెంపుకు రైతులను ప్రోత్సహించి సాగు చేయుటకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలాన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయబడుతున్న అన్నదాత పిఎం కిసాన్, సెంట్రల్లి స్పాన్సర్ట్ స్కీమ్స్ గురించి రైతులకు తెలియజేయాలని, ఫార్మర్ యాప్స్ గురించి, రైతు వాట్సప్ గ్రూపులు క్రియేట్ చేయుటకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**హైదరాబాద్ (నిజాంపేట్), జూన్ 21, ఆంధ్ర మనం:**

తండ్రి ఆరోగ్యం ఇంటిల్లిపాది కి శ్రీ రామ రక్ష,.....అలాగే ఆరోగ్యవంత జీవితం ద్వారానే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుంది అని ప్రముఖ వైద్యులు డా. మురళీ కృష్ణ అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా హైదరాబాద్ నిజాంపేట్ రాజీవ్ గాంధీ నగర్ లోని క్రిష్ మెడ్ స్పెషాలిటీ క్లినిక్స్ లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. డా, మురళీ కృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ తరచూ వైద్య పరీక్షల ద్వారానే ఆరోగ్యపరమైన, శారీరక లోపాలను గుర్తించి సరిచేసుకోగలరని అన్నారు. తమ బిడ్డల ప్రతి అడుగులోనూ వెన్నంటి నడిచే ఆదర్శం తండ్రులదని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ ప్రేమకు అమ్మ ప్రతిరూపం అయితే....బాధ్యత కు నాన్న నిలువెత్తు నిదర్శనమని అన్నారు. పిల్లల చిరునవ్వు కోసం తన జీవితాన్ని త్యాగం చేసేది నాన్న అని అన్నారు. ఈ వైద్య శిబిరం లో కంప్లీట్ బ్లడ్ కౌంట్, రాండమ్ బ్లడ్ షుగర్, హెచ్ బి ఏ 1సి , లివర్ ఫంక్షన్ తదితర పరీక్షలు జరిగాయి. ముందుగా ఫాదర్స్ డే కేక్ కటింగ్ జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ మురళీ కృష్ణ సతీమణి డా. శ్వేత పద్మ, తల్లితండ్రులు అరుణ కుమారి – ఎస్ సాంబశివరావు, నిమ్మరాజు కుమారుడు శ్రీవత్సవ కుమార్, ఆయా కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

# ఎంవిడీ హైస్కూల్లో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

**విశాఖపట్నం, జూన్ 21 ఆంధ్ర మనం :**



యోగాని ప్రపంచ దేశాలకు భారతావని అందించిన అమూల్యమైన కానుక అని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్ శ్రీలక్ష్మి అన్నారు. ప్రకృతి చికిత్సలయము, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త నిర్వహణలో మహారాణిపేట దండు బజార్ లోని మహారాజా విక్రమ్ దేవ్ ఉన్నత పాఠశాల ( ఎం వి డి హై స్కూల్) ఆవరణలో ఆదివారం 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. యోగాసాధకురాలు డాక్టర్ ఎస్ శ్రీలక్ష్మి విద్యార్థుల చేత యోగాసనాలు సాధన చేయించారు. వారు ప్రసంగిస్తూ యోగ ఆరోగ్య ప్రధాయిని, మానవునికి తేజస్సు ప్రసాదిస్తుందని, రుక్మతలు నివారిస్తుందని ఋషుల కాలం నుంచి మనదేశంలో యోగ ఆచరణ లో ఉన్నదని , యోగ మన దేశ సంపదని అన్నారు. యోగాని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన ఘనత ప్రధాని మోడీది అని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకురాలు హిమబిందు, విద్యార్థులకు యోగాలోని మెలకువలు నేర్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.. శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు ఎస్. క్షీరాబ్దిదుతి, లోకేష్, వర్ధన్ నూకరాజు, ఎస్ సాయి పూజిత, ఎస్ నీరజ, సోనాక్ష్మి హన్సిత, హరీష్, మొదలుగు వారు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయండి

## కార్యకర్తలకు ఎమ్మెల్యే ముత్తుముల పిలుపు

**గిద్దలూరు, జూన్ 21 ఆంధ్ర మనం :**




గిద్దలూరు నియోజకవర్గం బేస్తవారిపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఓటరు జాబితా విశ్లేషణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మండల స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలకు ఓట రు జాబితా సవరణ, పరిశీలన ప్రక్రియలో పాటించాల్సిన విధి విధానాలపై సవివరంగా అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, లోపాలు లేకుండా ప్రతి అర్హులైన ఓటరు పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. అలాగే పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరవేసి పార్టీపై మరింత విశ్వాసాన్ని పెంపొందించేలా కృషి చేయాలని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల లో పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బేస్తవారిపేట తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఏపీ తొలి సైనిక్ వెల్ఫేర్ మాజీ డైరక్టర్ స్వర్ణ కుమారి కన్నుమూత!

**విజయవాడ, జూన్ 21 ఆంధ్ర మనం :**



ఆంధ్రప్రదేశ్ సైనిక సంక్షేమ శాఖ మాజీ డైరెక్టర్ టి. స్వర్ణ కుమారి (66) ఆదివారం విజయవాడలో కన్నుమూశారు. రాష్ట్ర విభజన తర్వాత, రెండుగా విడిపోయిన ఈ శాఖ ఏపీ విభాగానికి స్వర్ణకుమారి పదేళ్ల పాటు హెచ్వోడీ బాధ్యతలను నిర్వహించారు. పదవీ విరమణ తర్వాత స్థానికంగా గుంటుపల్లిలో ఆమె నివాసం ఉంటున్నారు. కాగా కొంతకాలంగా అస్వస్థతగా ఉంటున్న ఆమె, స్థానికంగా వైద్య ఆరోగ్య సేవలు పొందారు. భర్త రిటైర్డ్ బ్యాంక్ ఆఫీసర్ కాగా, వారికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# దుర్గమ్మను దర్శించుకున్న పెనుగొండ సుబ్బారాయుడు

**విజయవాడ, జూన్ 21, ఆంధ్ర మనం:**



జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, ఆర్యవైశ్య ప్రముఖులు, చార్టెడ్ అకౌంటెంట్ పెనుగొండ సుబ్బారాయుడు ఆదివారం కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌తో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రత్యేక దర్శనం చేసుకున్న పెనుగొండ సుబ్బారాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్–2026 పరీక్ష

**విజయవాడ, జూన్ 21, ఆంధ్ర మనం :**

జాతీయ స్థాయి వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ (యూజీ)-2026 ఎన్టీఆర్ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఏర్పాటు చేసిన 31 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 10,920 మంది అభ్యర్థులకు గాను 10,279 మంది పరీక్షకు హాజరై 94.13 శాతం హాజరు నమోదైనట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ శ తెలిపారు. పరీక్ష నిర్వహణను కలెక్టర్ నిరంతరం పర్యవేక్షించగా, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ విజయవాడలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల ధ్రువీకరణ, బయోమెట్రిక్ హాజరు నమోదు, భద్రతా చర్యలు తదితర అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. . నీట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన కోఆర్డినేటర్లు, అబ్జర్వర్లు, కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లతో పాటు రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ప్రజారవాణా తదితర శాఖల అధికారులను కలెక్టర్ అభినందించారు.






# ఘనంగా యోగా దినోత్సవం

**విజయవాడ జూన్ 21 ( ఆంధ్ర మనం ):** ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం యోగా ఘనంగా నిర్వహించారు. యోగా ప్రోటోకాల్‌లో భాగంగా 45 నిమిషాల పాటు వివిధ ఆసనాలు నిర్వహించి శాంతి మంత్రంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మట్టా ప్రసాద్, బొడ్డు నాగలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివనారాయణ, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, చైతన్య శర్మ, రత్నకుమారి, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు జి. శివ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. యోగా కార్యక్రమ నిర్వాహకుడు కె. మురళీకృష్ణంరాజును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యాలయ కార్యదర్శి పవన్ జీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


**బొజ్జన్నకొండ వద్ద యోగా దినోత్సవం**

**అనకాపల్లి, జూన్ 21, ఆంధ్ర మనం:** మానసిక ఒత్తిడిని దూరం చేయడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉత్తమ సాధనమని, ప్రతి ఒక్కరూ దానిని తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సూచిం చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం అనకాపల్లి మండలం, బొజ్జన్నకొండ వద్ద యోగాంధ్ర – 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సామూహిక యోగాసనాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా యోగా అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సామూహిక యోగాసనాల్లో పాల్గొన్నారు.

# ప్రతి ఓటుకు విలువ పెంచేదే సరైన ఓటరు జాబితా

- 9వ డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ, జూన్ 21, ఆంధ్ర మనం:**



ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉంటేనే ప్రతి ఓటుకు పూర్తి విలువ దక్కుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలును ఆదివారం 9వ డివిజన్ పటమటలంకలోని లైబ్రరీ సెంటర్ వద్ద ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తప్పుడు పేర్లు, తప్పుల వివరాలు కొనసాగితే అసలైన ఓటర్ల హక్కులకు భంగం కలిగే అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండటంతో పాటు వివరాలు సక్రమంగా నమోదవడం అవసరమని చెప్పారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఉన్న లోపాలను సరిదిద్దుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రజలు చొరవ చూపి తమ వివరాలను ధ్రువీకరించుకోవాలని కోరారు.కార్యక్రమంలో బీఎల్‌వో ప్రవీణ్, పార్టీ నాయకులు చెన్నుపాటి గాంధీ, కాంతిశ్రీ, కర్ణ రమేష్, పఠాన్ హయత్‌ఖాన్, సుధీర్, గోపి పాల్గొన్నారు.

# క్రాంతి కుటుంబానికి న్యాయం చేయాలి

**విజయవాడ, జూన్ 21, ఆంధ్ర మనం:**



పోలీసుల వేధింపుల కారణంగానే క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకున్నారని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. క్రాంతి కుమార్ మృతికి నెలరోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతల బృందం ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడుతూ, సాయికృష్ణ, క్రాంతి కుమార్ మరణాలు ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. క్రాంతి కుమార్‌పై ప్రస్తుతం ఎలాంటి కేసులు లేవని, అయినప్పటికీ పోలీసులు వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. డీజీపీ, సీపీ బాధిత కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని, ఈ కేసుపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, బాధిత కుటుంబాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ, విజయవాడలో పోలీసులు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని విమర్శించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని, న్యాయం జరగకపోతే దళిత సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా పాలన సాగుతోందని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్ మాట్లాడుతూ, పోలీసుల వేధింపుల వల్లే క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. క్రాంతి కుమార్ తండ్రి వెంకటేశ్వర రావును పరామర్శించిన వారిలో దేవినేని అవినాష్, రాయన భాగ్యలక్ష్మి, పూనూరు గౌతమ్ రెడ్డి, షేక్ ఆసిఫ్, పోతిన మహేష్, మాజీ డిప్యూటీ మేయర్ అవుతూ శైలజా, కార్పొరేటర్ రహీనా నాహీద్, ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

**విజయవాడ, జూన్ 21, ఆంధ్ర మనం:**



ఇంద్రకీలాద్రిపై 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత 15 రోజులుగా కొనసాగిన 'యోగాంధ్ర' శిక్షణ శిబిరం ఈ కార్యక్రమంతో విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయం, దేవాలయ సంస్కృతిలో యోగా కీలక భాగమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ కనకదుర్గమ్మ సన్నిధిలో తొలిసారిగా 15 రోజులపాటు యోగా శిక్షణ నిర్వహించడం విశేషమన్నారు. వేలాది మంది భక్తులు, సిబ్బంది ఆరోగ్య అవగాహన పొందారని తెలిపారు.ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఈసారి సుదీర్ఘ శిక్షణ ద్వారా భక్తుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించగలిగామని చెప్పారు.వేడుకల్లో ధర్మకర్తలు, అధికారులు, అర్చకులు, విద్యార్థులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. శిక్షకుడు గర్రె రాజేష్‌ను అధికారులు సత్కరించారు.

# సూర్య నమస్కారాలను తప్పనిసరి చేసిన తొలి జిల్లాగా రికార్డు

- కోటి మందితో యోగ ప్రపంచ రికార్డులో భాగస్వామ్యం
- మన్యం జిల్లాలో మిన్నంటిన యోగా ఉత్సాహం
- కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడి

**పార్వతీపురం, జూన్ 21, ఆంధ్ర మనం :**



జిల్లాలోని ప్రతి పాఠశాల విద్యార్థికి సూర్య నమస్కారాలను తప్పనిసరి చేసిన మొట్టమొదటి జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లా రికార్డు సృష్టించిందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి సగర్వంగా ప్రకటించారు. పాఠశాలల్లో సూర్య నమస్కారాలు తప్పనిసరి చేయడం బహుశా ప్రపంచంలోనే మన్యం జిల్లా ప్రథమ స్థానంలో ఉండవచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయుష్ శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన వేడుకలు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆయన యోగా సాధకులను ఉద్దేశించి ప్రసంగించారు.యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి పైగా ఏకకాలంలో యోగాసనాలు వేసి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారని, ఇందులో మన్యం జిల్లా ప్రజలు భాగస్వాములు కావడం గర్వకారణమని కొనియాడారు. నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవడం ద్వారా ఒత్తిడి లేని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని చెప్పారు. యోగా అనేది కేవలం వ్యాయామం కాదని, మన సంస్కృతి అందించిన అమూల్యమైన ఆరోగ్యవరమని గుర్తుచేశారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో 12 పతకాలు సాధించిన వారికి, జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జ్ఞాపికలను, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్( ఎఫ్ ఎ సి ), జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి, మునిసిపల్ కమిషనర్ డి.పావని, ఆయుష్ శాఖ వైద్యాధికారి టి.హేమాక్ష్మి యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డా. టి.జగన్మోహనరావు, డిఎంహెచ్ఐ డా. ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డా. జి.నాగభూషణ రావు, ఇతర జిల్లా అధికారులు, యోగా శిక్షకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యోగా ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.




# 'మా ఇంటి బంగారం'కు బలమైన వసూళ్లు

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తొలి ప్రదర్శన నుంచే సానుకూల స్పందనను సొంతం చేసుకుంది. కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఘట్టాలు, సమంత నటన ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమా తొలి రెండు రోజుల్లోనే గట్టి వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాల అంచనాలు చెబుతున్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.13.15 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించినట్లు సమాచారం. ట్రేడ్ లెక్కల ప్రకారం రెండో రోజు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.15 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంచనా. దీంతో కేవలం రెండు రోజుల్లోనే 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.25 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు అందుకున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశీయ మార్కెట్‌లోనూ సినిమా బలమైన ప్రదర్శన కనబరుస్తోంది. తొలి రోజు దేశవ్యాప్తంగా రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లు నమోదు చేసిన ఈ చిత్రం, రెండో రోజు మరింత పెరుగుదల సాధించి రూ.7.50 కోట్ల నెట్ వరకు చేరినట్లు బాక్సాఫీస్ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా రూ.12.85 కోట్ల నెట్ వసూళ్లు నమోదైనట్లు తెలుస్తోంది. శనివారం వసూళ్లలో కనిపించిన పెరుగుదలతో ఆదివారం కలెక్షన్లు మరింత బలపడే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. విదేశీ మార్కెట్‌లో కూడా 'మా ఇంటి బంగారం'కు మంచి స్పందన లభిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో ఈ చిత్రం బలమైన వసూళ్లు సాధిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్ ముగిసే నాటికి ఒక మిలియన్ డాలర్ల మైలురాయిని అందుకునే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే సమంత కెరీర్‌లో మరో విశేషమైన మైలురాయి చేరినట్లవుతుంది. ఇప్పటికే విదేశీ మార్కెట్‌లో సమంతకు ఉన్న బలమైన ఆదరణను ఈ చిత్రం మరోసారి రుజువు చేస్తున్నట్లు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాకు వస్తున్న స్పందనకు టికెట్ బుకింగ్స్ కూడా నిదర్శనంగా నిలుస్తున్నాయి. మంచి మాట వినిపించడంతో కుటుంబ ప్రేక్షకులు కూడా థియేటర్లవైపు మొగ్గుచూపుతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 'మా ఇంటి బంగారం'లో సమంత పోషించిన స్వర్ణ పాత్రకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు సమాచారం. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహిళగా ఒకవైపు సహజమైన భావోద్వేగాలను పండిస్తూ, మరోవైపు మాస్ యాక్షన్ సన్నివేశాల్లో దూకుడుగా కనిపించిన సమంత నటనకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఈ చిత్రం సమంత కెరీర్‌లో అత్యుత్తమ ఆరంభం నమోదు చేసిన చిత్రాల్లో ఒకటిగా నిలుస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సప్తమి గౌడపై ఆసక్తికర విషయాలు వైరల్

ఒకే ఒక్క సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ సప్తమి గౌడ ప్రస్తుతం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార' చిత్రంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆమె, ఆ తర్వాత వరుస ప్రాజెక్ట్‌లతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లారు. 'కాంతార' సినిమాతో డీ గ్లామర్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న సప్తమి గౌడ, ఆ చిత్ర విజయంతో ఒక్కసారిగా పాన్ ఇండియా గుర్తింపు పొందారు. ఈ సినిమా అన్ని భాషల్లో విజయవంతం కావడంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వచ్చిన 'ది వ్యాక్సిన్ వార్' చిత్రంలో కూడా నటించి మంచి గుర్తింపు పొందారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నితిన్ హీరోగా వచ్చిన 'తమ్ముడు' సినిమాతో సప్తమి గౌడ కథానాయికగా అడుగుపెట్టారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమెకు టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఆమె ఎక్కువగా కన్నడ చిత్ర పరిశ్రమపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇక సోషల్ మీడియాలో మాత్రం సప్తమి గౌడ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉన్నారు. ఒకే ఒక్క సినిమాతో వచ్చిన భారీ క్రేజ్ తర్వాత ఆమె తదుపరి ప్రాజెక్ట్‌లపై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. త్వరలో ఆమె నుంచి మరిన్ని కొత్త సినిమాల ప్రకటనలు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# 'బాహుబలి' డాక్యుసిరీస్‌కు విడుదల తేదీ




ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన 'బాహుబలి' ఫ్రాంచైజీకి సంబంధించి మరో ఆసక్తికర అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. 'బాహుబలి: ది టార్చ్ బేరర్' పేరుతో రూపొందిన డాక్యుసిరీస్ ఈ నెల 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'బాహుబలి' రెండు భాగాల విజయంతో తెలుగు సినిమా అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నేపథ్యంలో, ఇప్పుడు ఆ మహా ప్రయాణం వెనుక కథలను ఈ డాక్యుసిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇది సాధారణ సినిమా కాకుండా, 'బాహుబలి' రూపుదిద్దుకున్న తీరు, ఆ ఫ్రాంచైజీ వెనుక ఉన్న కఠిన శ్రమ, సృజనాత్మక దృష్టి, సాంకేతిక విస్తృతి, ప్రపంచవ్యాప్తంగా దక్కిన స్పందన వంటి అంశాలను ప్రతిబింబించే డాక్యుసిరీస్‌గా రూపొందినట్లు సమాచారం. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆలోచన ఎలా ఆవిర్భవించింది, ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ వంటి తారలు తమ పాత్రల కోసం ఎలా సిద్ధమయ్యారు, వేలాది మంది సాంకేతిక నిపుణులు ఈ మహా ప్రాజెక్ట్ కోసం ఎంతటి కృషి చేశారు వంటి విశేషాలను ఇందులో చూపించనున్నారు. ముఖ్యంగా యుద్ధ సన్నివేశాల రూపకల్పన, దృశ్య ప్రభావాల పనితీరు, చిత్రీకరణలో ఎదురైన సవాళ్లు వంటి తెరవెనుక విషయాలు అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశముంది. అంతేకాదు, 'బాహుబలి' విడుదలైన తర్వాత దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన స్పందన, బాక్సాఫీస్ రికార్డులు, సాంస్కృతిక ప్రభావం, తెలుగు సినిమాపై ఏర్పడిన కొత్త దృష్టికోణం వంటి అంశాలకూ ఈ డాక్యుసిరీస్‌లో ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక ప్రాంతీయ చిత్రంగా ప్రారంభమైన 'బాహుబలి' ఎలా విశ్వవ్యాప్త చర్చకు దారి తీసిందో, భారతీయ సినిమా పరిధిని ఎలా విస్తరించిందో ఈ రూపంలో మళ్లీ చూపించబోతున్నారు. అందుకే ఈ ప్రకటనతో ప్రభాస్, రాజమౌళి అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఇక మరోవైపు 'బాహుబలి: ది ఎపిక్' కలిపిన రూపం గురించి కూడా అభిమానుల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆ సంయుక్త సంచికకు సంబంధించిన అన్ని భాషల ప్రసారంపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మాత్రం 'బాహుబలి: ది టార్చ్ బేరర్'పై అందరి దృష్టి నిలిచింది. సినిమా కాకపోయినా, సినిమా వెనుక ఉన్న మహా ప్రయాణాన్ని ఆవిష్కరించే ఈ డాక్యుసిరీస్ అభిమానులకు కొత్త అనుభూతిని అందించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# నిర్మాత గొట్టిముక్కల పద్మారావు మృతి



తెలుగు చలనచిత్ర పరిశ్రమతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సినీ నిర్మాత, రాజకీయ నాయకుడు గొట్టిముక్కల పద్మారావు (72) ఆదివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్త తెలియగానే కూకట్‌పల్లిలోని నివాసానికి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, స్థానిక రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు. పద్మారావు మృతి పట్ల సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గొట్టిముక్కల పద్మారావు తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. ఆయన స్థాపించిన 'పద్మప్రియ ఆర్ట్స్' బ్యానర్ ద్వారా విభిన్న కథాంశాలతో పలు విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. సుమన్ హీరోగా తెరకెక్కిన 'కంచు కవచం' వంటి యాక్షన్ చిత్రంతో పాటు, రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో రూపొందిన వినోదాత్మక చిత్రం 'జోకర్'ను కూడా నిర్మించారు. అంతేకాకుండా తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిన క్లాసిక్ కామెడీ చిత్రం 'ఏప్రిల్ 1 విడుదల' వంటి విజయవంతమైన సినిమాలను నిర్మించి ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. వైవిధ్యమైన కథలను ప్రోత్సహిస్తూ, కొత్త ఆలోచనలతో సినిమాలను నిర్మించిన పద్మారావు, పరిశ్రమలో అందరితో సాన్నిహిత్యంగా మెలిగే వ్యక్తిగా పేరొందారు. సినిమా రంగంలోనే కాకుండా ప్రజా సేవలోనూ చురుకుగా పాల్గొంటూ సమాజానికి తనవంతు సేవ చేసిన ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని సినీ ప్రముఖులు పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ అభిమానులు, పరిశ్రమ వర్గాలు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# ధనుష్-మృణాల్‌పై కొత్త ప్రచారం



కోలీవుడ్ నటుడు ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. పలుమార్లు ఇద్దరూ కలిసి కనిపించడం, ఒకరి కుటుంబ సభ్యులతో మరొకరు సన్నిహితంగా మెలగడం వంటి అంశాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. అయితే తాజాగా ఈ ఇద్దరూ దూరమయ్యారంటూ సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. దీంతో ధనుష్, మృణాల్ సంబంధంపై మ-రోసారి ఆసక్తికరమైన ప్రచారం తెరపైకి వచ్చింది. మృణాల్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ధనుష్ సోదరీమణులు కార్తీక, విమలా గీతలను అనుసరిస్తుండటమూ ఈ వార్తలకు మరింత ఊతమిచ్చింది. దీంతో ఇద్దరూ ప్రేమలో ఉన్నారనీ, త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనీ కథనాలు వినిపించాయి. ఈ ప్రచారంపై ధనుష్ ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. అయితే మృణాల్ మాత్రం గతంలో ధనుష్ తనకు మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆ వ్యాఖ్యలతోనూ పుకార్లకు పూర్తిగా తెరపడలేదు. ఈ ప్రచారంపై ఇప్పటి వరకు అటు ధనుష్ గానీ, ఇటు మృణాల్ గానీ అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు.




# ఓటీటీలోకి అర్జున్ 'బ్లాస్ట్' మూవీ

చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు. అర్జున్‌ని ఈ తరహా యాక్షన్ పా-త్రలో చూసి చాలా కాలమైంది. సగటు మధ్యతరగతి తండ్రిలా కనిపిస్తూనే.. కుటుంబానికి సమస్య ఎదురైనప్పుడు ఎంతదాకైనా పోరాడే వ్యక్తిగా ఆద్యంతం అలరించారు. కూతుర్ని వీరనారిలా పెంచాలనే అతని వ్యక్తిత్వం అందరినీ ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ప్రాధాన్యమున్న నీల పాత్రలో ప్రీతి ముకుందన్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రొఫెషనల్ కరాటే యువతిలా యాక్షన్ సన్నివేశాల్లో అదరగొట్టింది. అభిరామి పాత్రను పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దారు. అయితే ఆమె పాత్రని ఓ సర్‌ప్రైజ్‌లా రివీల్ చేసుంటే ఇంకాస్త బాగుండేదనిపిస్తుంది. జాన్ కొకేన్, పవన్ తదితరుల విలనిజం ఫర్వాలేదనిపిస్తుంది.

Printed, Published and Owned by CB Mohan Rao, Printed at Spandana Printers, 2-165, Peruru, Tirupati, Andhra Pradesh, and Published from 20-3-122/C, Onti Maddimanu Street, Tirupati Andhra Pradesh, Editor, C.B. Mohan Rao, PRGI No. APTEL/25/A3753, Ph: 98660 71887 Email. andhramanam2025@gmail.com